# కానుక

**-శ్రీచరణ్‌మిత్ర**

మాలతి కబురు పెట్టిందని తెలిసి ఆఘమేఘాలమీద ఆమె ఇంటికి వెళ్లాను. ఆ ఇల్లంతా పెళ్లి కళకళలతో నూతనత్వాన్ని ఆపాదించుకున్నట్లుగా నాకు తోచింది.

ఆ ఇంటికీ నాకూ మరో వారంరోజుల్లో రుణం తీరబోతున్నందుకు ఒకింత బాధగానే వున్నా నా మాలతి మరో నూతన జీవితంలోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగానూ వుంది. ఇకపై ఆ ఇంట్లోకి రాగానే 'రా మధూ' అని ఆప్యాయంగా పిలిచే నా మాలతి రేపు వేరే ఇంటికి ఇల్లాలిగా వెళ్లిపోయాక ఈ ఇల్లు ఇకపై దేవత లేని దేవాలయం. ఆత్మీయత దొరకని అరణ్యంలా తోచింది.

"రావయ్యా మధూ! నీ ఫ్రెండ్ నీ కోసం కలవరిస్తోంది. మీ మాలతి పెళ్లి అంటే ఆ బాధ్యత అంతా నీది కాదూ" అంటూ ఆప్యాయంగా పలకరించారు విశాలాక్షిగారు.

నేను పలకరింపుగా నవ్వాను. ఆమె మాలతి అమ్మగారు.

"కంపెనీలో పని వత్తిడి ఎక్కువగా వుందండీ. సెలవు దొరకడంలేదు. ప్రయివేటు పనికదా. సెలవు దొరకడమే గగనమైపోతోంది" అని చెప్పాను ఆవిడతో.

"చాలా కష్టపడుతున్నావన్నమాట. మరి మీ స్నేహితురాలికి ఏం కానుక ఇస్తావో చూడాలి" అందామె నవ్వుతూ.

ఆమె మామూలుగానే అందో ఏమిటోగానీ ఆ మాట నన్ను వెక్కిరిస్తున్నట్లుగానే తోచింది నాకు.

"మాలతి ఎక్కడ ఆంటీ?" అడిగాను విశాలాక్షి గారిని.

"అదిగో ఆ తోటలో మొక్కలకు నీళ్ళు పోస్తోంది. వెళ్ళు. నేను కాఫీ తీసుకొస్తాను" ఆమె ఇంటిలోకి వెళ్లిపోయింది.

వెనుక గది తెరిచి పెరటివైపు దృష్టి సారించిన నాకు వనదేవత వయ్యారంగా వలపును రంగరించి మొక్కలను సాకుతున్నట్లుగా తోచింది. స్టీలు బిందెతో సుతారంగా ఓ మొక్క మొదళ్లకు నీరు పెడుతోంది.

నేను చనువుగా దగ్గరకువెళ్లి "నాకు కూడా కాస్త దాహం తీరుస్తారా?" అన్నాను నెమ్మదిగా.

ఆమె సౌమ్యంగా తలెత్తి చూసింది.

వేయి చందమామలు ఏకమై చల్లదనాన్ని కురిపిస్తున్నట్లు చక్కటి ఆ వదనంలో ఎక్కడో చిన్న విషాదం. అయినా చెదరని చిరునవ్వుతో "ఇప్పటికి గుర్తుకొచ్చానా?" అంది నిష్ఠూరంగా.

ఆమె ముఖంలోకి ధైర్యంగా చూసే ధైర్యంలేక ముఖం దించుకున్నాను.

"రా మధూ. గేటు ముందు మరికొన్ని మొక్కలకు నీరుపోసి వస్తాను. ఒక అయిదు నిముషాలు ఆగుతావా?" అంది అభ్యర్ధనగా.

నేను చిన్నగా నవ్వి "నేను హెల్ప్ చేయనా?" అనడిగాను.

"ఊహూ. ఈ మొక్కలకి నా చేతులమీదుగా నీరు పోస్తేనే నాకు సంతృప్తి. మనం అభిమానించే వాటిని మనం సాకటంలోనే ఆనందం వుంటుంది" అంటూ ఆమె ఇంటి ముందు గేటు వద్దకు నడిచింది.

నేను ఆమెను మౌనంగా అనుసరించాను.

"నీ మమతను పొందిన ఈ మందారం మొక్క ఎంతో అదృష్టం చేసుకుంది మాలతీ"


"కానీ ఏం లాభం? నేను వెళ్లేలోగా ఒక్క మందారపువ్వయినా నాకు కానుకగా ఇచ్చేలా లేదు" అంది మాలతి.

"కొన్ని బ్రతుకులకు అర్పించటమే తప్ప అర్పించుకోవడం అసలు వీలుకాదు మాలతీ. ఈ మొక్క కూడా అలాంటిదేనేమో?" అన్నాను.

ఆ మాటకు పెదవులు దాటని ఆ నవ్వే సమాధానంగా ఎప్పుడూ నా స్థితిని అర్థం చేసుకున్న రీతిలో జాలిగా నవ్వింది. ఇద్దరం మౌనంగా ఇంట్లోకి నడిచాం.

***

మాలతి చిన్నప్పట్నించి నా ఆరాధ్య దేవత. దేవతలు ఎప్పుడూ అమితమైన కరుణ కలిగి



ఉంటారట. అది నిజమో కాదో నాకు తెలీదుకానీ నాకు మాత్రం పోతపోసిన కరుణామూర్తిలా కనిపించేది మాలతి. అందంలోనూ, మాటలోనూ, ప్రవర్తనలోనూ, అనురాగంలోనూ ఏమాత్రం కల్మషం లేని కరుణామయి మాలతి.


మాలతీతోనేకాదు, మాలతి కుటుంబంతోనే మాకు పదిహేను సంవత్సరాల పరిచయం వుంది. మా పూరిపాక పక్కనే పెద్ద బంగ్లాలో మాలతీ వాళ్ల కుటుంబం ఉండేది. వాళ్ల నాన్నగారు ఏదో కేంద్ర ప్రభుత్వ శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా ఉండేవారు. మా అమ్మ వాళ్లింట్లో పనికి కుదిరింది. నాన్న కూడా వాళ్లింట్లో చిన్న పనీ, పెద్ద పనీ చేస్తుండేవాడు అప్పుడప్పుడు. చిత్రమేమిటంటే మాలతి కూడా మా గవర్నమెంటు స్కూల్‌లో చదవడంతో మా అనుబంధానికి ఆలంబన ఏర్పడింది. మాలతితో స్కూల్‌కెళ్లడం, మళ్లీ మాలతి ఇంట్లోనే ఆడుకోవడంతోనే నా బాల్యం సాగిపోయింది. అయితే మాలతి నాన్నగారు బాలసుందరంగారుగానీ, ఆయన భార్య విశాలాక్షిగారుగానీ నన్నెప్పుడూ పనివారి కొడుకుననే చులకనభావంతో చూసేవారుకాదు. వాళ్లల్లో కనీసం అలాంటి భావాలు కూడా ఉండేవికావు. నిత్య పేదరికంవల్ల కాబోలు నాలో ఏదో చెప్పలేని దిగులు ఆవరించి ఉండేది. ఆ దిగులులో అంతులేని అమాయకత్వం. ఆ అమాయకత్వం నుండి నిస్పృహయత్వం నన్ను ఆవహించాయి. ధనవంతుల్లో ఒకరకమైన అహంభావం, నిరుపేదల్లో ఇంకో రకమైన నిర్వేదం చోటు చేసుకుంటాయి. మానవ జీవితాల్ని ఈ రెండూ సహజంగా ఉండనివ్వవు. మాలతితో స్నేహంగా ఉండేవాడిని. కానీ మా ఇంట్లో 'మనం పేదవారం బాబూ' అని అమ్మ ఎప్పుడూ చెబుతుండడంతో 'వారితో మనం తూగలేం' అనే భావన నన్ను నిరంతరం పీడించేది. ఏ విషయంలోనైనా కనీసం నా ఆధిక్యత నిరూపించుకోవాలని ఆరాటపడేవాడిని. కానీ నాకు ఎప్పుడూ అలాంటి అవకాశమే రాలేదు. ఆ ఆరాటంతోనే నేను అనుక్షణం ఓడిపోయేవాడిని. సరిగ్గా అలాంటి సమయంలోనే నా అమాయకత్వాన్ని అభిమానించి నన్ను అనునయించే దేవతలా రూపొందిన మాలతి అంటే నాకు అభిమానమే కాదు, ఆరాధన కూడా. నా చిన్నప్పుడే ఒకసారి క్లాసులో మాస్టారు ఏవో నోట్స్ కొనమన్నారు. నేను మా నాన్నచేత దెబ్బలయితే తిన్నానుగానీ నోట్సు కొనుక్కోలేకపోయాను. ఆ సాయంత్రం మాలతి ఇంటికి వెళ్లాను.

"మధూ! డాడీ నాకు నోట్సులు తెచ్చారు" అంటూ బ్యాగులో నోట్సులు తీసి చూపించింది మాలతి. రెండు కొత్త నోట్సులు. 'నాకో నోట్సు ఇవ్వవా మాలతీ' అని అడగాలనిపించింది. కానీ అడగలేకపోయాను.

"ఇది మాస్టారు రాయమన్నదానికోసం' అంది ఒక నోట్సు నాకు చూపిస్తూ.

"ఇంకొకటి?"

"నీకోసం" అంది తన చక్రాల్లాంటి కళ్లను చిత్రంగా తిప్పుతూ.



అలా ప్రతి వస్తువునూ ఒకటి తనకోసం, ఇంకోటి నీకోసం అంటూ నా అవసరాలన్నీ ముందుగా కనిపెట్టి వాటిని తీర్చడమే వ్రతంగా పెట్టుకున్న మాలతి నాకు అపురూపమైన దేవతలా కనిపించేది. 'ఆ దేవతకు నేనేమివ్వగలను?' అనే ఆలోచన నన్ను చిన్నప్పటి నుంచీ వేధించేది. ఆమె ఆర్థికస్థాయికి నేనేదిచ్చినా అది చాలా చిన్నదే అవుతుంది.

ఓసారి నేను హైస్కూల్‌లో ఉండగా పదో తరగతి చదివేటప్పుడు కాబోలు మాలతి తన పుట్టిన రోజును గ్రాండ్‌గా జరుపుకోవాలని ప్లాన్ చేసింది.

## కోటిసార్లు

''అంతగా ప్రేమించిన మానసను పెళ్లెందుకు చేసుకోలేదు?'' అడిగాడు చక్రపాణి.

''ఆవిడ రాసిన పది పేజీల ప్రేమలేఖను కోటిసార్లు చదివినా తనివి తీరలేదోయ్. ఈలోగా ఆవిడకు పెళ్లి అయింది. ఒక కొడుకు పుట్టాడు'' బాధగా చెప్పాడు ఆంజనేయులు.

**-కె. గురునాథపిళ్లై** (మదనపల్లె)

## సీరియల్

ప్రక్కింట్లోంచి స్త్రీ ఏడుపు వినిపిస్తుండటంతో ''ఏమై ఉంటుందో చూసి రామ్మా'' అన్నాడు పరంధామయ్య ఆందోళనగా.

''మీరేం కంగారు పడకండి నాన్నా! ఇది టీవీలో సీరియల్స్ వచ్చే సమయం. అని పూర్తయ్యేవరకు అప్పుడప్పుడు ఏడుపు అలా వినిపిస్తూనే ఉంటుంది'' చెప్పింది కూతురు.

## సలహా

''ఈ మధ్య కూరల్లో ఉప్పు, కారం తెగ వేస్తున్నావు. కాస్త తగ్గించు'' కోపంతో రంకెలు వేశాడు భర్త.


''అలాగే... మీరు కూడా కొంచెం బి.పి. తగ్గించుకోండి'' సలహా ఇచ్చింది భార్య.

## సాక్షులు

''ఈ కేసులో నువ్వు నిర్దోషివని చెప్పగలిగే సాక్షులెవరైనా వున్నారా'' ముద్దాయిని ప్రశ్నించాడు జడ్జి.

''ఓ లాయర్ కుదిర్చిన వాళ్లున్నార్సార్'' నోరు జారి ఆపై నాలికక్కర్చుకున్నాడు ముద్దాయి.

**-సోనికా ఫీవ్‌లె** (సికింద్రాబాద్)




మాటల సందర్భంలో ఎవరో అన్నారు 'మధు తన ఫ్రెండ్ మాలతికి ఎలాంటి బహుమతి ఇస్తాడో చూడాలి' అంటూ. నేను మాలతికి నా కానుకగా ఏమైనా ఇవ్వాలి. ఏం ఇవ్వాలి? మాలతికి ఇష్టమైనవి ఏమిటా అంటూ రాత్రంతా తెగ ఆలోచించాను. ఒకసారి తనకు తాజ్‌మహల్ అంటే చాలా ఇష్టమని చెప్పినట్లు నాకు గుర్తుకొచ్చింది. నాకున్న ఏకైక ఆస్తి అయిన నా చేతి వాచీని అమ్మేసి ఒక అందమైన తాజ్‌మహల్‌ను తీసుకుని అందంగా ప్యాక్ చేయించాను.

నేను ఆ సాయంత్రం వచ్చేటప్పటికి-

మాలతి ఇంటి నిండా. మా క్లాసు పిల్లలు, మాలతి స్నేహితులు, బంధువులతో నిండిపోయి వుంది. నేను వెళ్లగానే ఆప్యాయంగా నన్ను ఆహ్వానిస్తూ "రా మధూ'' అంది.

నా చేతిలోవున్న ప్యాకెట్‌ను ఆసక్తిగా గమనిస్తూ "ఏంటి?'' అంది చిరునవ్వుతో.

"నాదో చిన్నకానుక'' అంటూ ఆమె చేతికి అందిస్తూ ఆమె సరిగ్గా పట్టుకుందో లేదో సరిగా గమనించకుండానే నేను వదిలేసాను.

ఫలితం! తాజ్‌మహల్ బొమ్మ క్రిందపడి పగిలిపోయింది. అక్కడ పగిలింది బొమ్మకాదు, నా హృదయమే. ప్యాకింగ్‌లోనుండి తాజ్‌మహల్ బొమ్మ చుట్టూ కట్టిన అద్దాలు పగిలి బయటకు వచ్చాయి.

"అబ్బ ఏంటి మధూ ఆ గాబరా'' అంటూ మాలతి కాస్త చిరాకుపడినా "అదేమిటి'' అని అడిగింది మళ్ళీ.

"తాజ్‌మహల్!''

"అయ్యో తాజ్‌మహల్ అంటే నాకెంతో ఇష్టం. ప్చ్ పగిలిపోయింది. పోన్లే అయినా నువ్వొచ్చావు కదా. నాకదే చాలు'' అంటూ కేక్ కట్ చేయడానికి సిద్ధమైంది. ఎవరో కిందపడిన నా గిఫ్ట్‌నూ, పగిలిన గాజు పెంకులనూ చీపురుతో ఎత్తేస్తున్నారు.

టేబుల్‌పై రకరకాల కానుకలు, అందంగా ప్యాక్ చేయబడి నన్ను చూసి ఫక్కున నవ్వినట్లనిపించింది. కళ్లల్లో మసగ్గా నీరు నిండినట్లయినా నిగ్రహించుకోగలిగాను. నా పరిస్థితి అంతా గమనిస్తున్న మాలతీయే నా దగ్గరకు వచ్చి "నువ్వింగా ఆ గిఫ్ట్ గురించి ఆలోచిస్తున్నావా మధూ'' అంది.

"నేను నీకు ఏమీ ఇవ్వలేనేమో మాలతీ'' అన్నాను కాస్త బొంగురుపోయిన గొంతుతో.

"ఛ...ఛ అదేం లేదు. అలాంటివన్నీ ఆలోచించి మనసు పాడు చేసుకోకూడదు తెలుసా?'' అంటూ పెద్ద ఆరిందలా నన్ను అనునయించింది.

అదే ఆమెలో ప్రత్యేకత. నన్నంటిన ప్రతీ విషాదంలోనూ నాకు ఓదార్పును, ధైర్యాన్ని ప్రసాదించగలిగే ఆ దేవతకు నేనేమివ్వగలను?

★★★

మూగగా పెనవేసుకున్న మా ఆత్మీయత మాలతిలో ప్రేమ బీజాలు నాటుతుందని నేను ఏనాడూ ఊహించలేదు. మాలతి ఆకాశంలో మెరిసే నక్షత్రం అయితే నేలపై ఉన్న నల్లరాయిని నేను. అలాంటిది చిత్రంగా ఆమె నన్ను ప్రేమిస్తున్నానంటూ ఆమె తన అభిప్రాయాన్ని చెప్పినప్పుడు నా బుర్ర మొద్దుబారినట్లయింది. నాకేం చెప్పాలో అర్థం కాలేదు. నాలాంటి నిరుపేద మాలతిని ప్రేమించడానికి అర్హుడేనా? నాకు ఏ విషయం చెప్పాల్సి వచ్చినా ఇంట్లో మనిషిలా అతి సున్నితంగా చెప్పే బాలసుందరం గారు ఒకసారి చెప్పిన విషయం జ్ఞాపకం వచ్చింది.

"మధూ! వయస్సంటూ వచ్చాక సమాజం ఆడపిల్లలకు కొన్ని హద్దులను నిర్ణయించింది. అలాంటి హద్దులను అతిక్రమించే ఆడపిల్లను సమాజం హీనంగా చూస్తుంది. దానివలన నీవు ఎంతో అభిమానించే మాలతి తన ఉన్నత స్థానాన్ని కోల్పోతుంది. అది నీవు భరించగలవా? నీవంటే ఎంతో అభిమానంగల మాలతికి నీవిచ్చే కానుక ఇదేనా? నీవంటే మాకు పూర్తి నమ్మకం వుంది. నీ గురించి కలలో కూడా చెడుగా ఊహించలేము. కానీ లోకానికి అదంతా అవసరం లేదు. ఇలా ఉంటే మాలతి జీవితం అస్తవ్యస్తం అయ్యే ప్రమాదం వుంది. ఆలోచించు'' అంటూ సున్నితంగా హెచ్చరించి వెళ్లిపోయారు. 'మాలతిని ఎక్కువగా కలవకూడదు' అన్న ఆంక్ష నాకు బాధ కలిగించే అంశమే అయినా నా మాలతి అందమైన జీవితానికి నావల్ల విఘాతం కలుగుతుందన్న భావనను నేను భరించలేకపోయాను. నా మాలతికి ఎప్పుడు ఎలాంటి కష్టమూ కలగకూడదు అని నేను నిశ్చయించుకున్నాను. తల్లిదండ్రులను ఎదిరించి నన్ను పెళ్లి చేసుకోవడం మాలతికి పెద్ద ఇబ్బంధి కాకపోయినా దానివలన ఆ తల్లిదండ్రులకు రంపపుకోత మిగిల్చినవాడినవుతాను. నిరుపేదలకు ఆశ్రయమిస్తే ఇలా నాశనం చేస్తారని చెప్పడానికి నేనే ఒక నిర్వచనం అవుతాను.

మాలతికి కనీస సౌకర్యం కలుగజేసే ఆర్థిక స్థోమత కూడా ప్రస్తుతానికి లేని అసమర్థుడ్ని నేను. అందుకే మాలతి కోరికను తిరస్కరించాను.

అదిగో ఆ మూడునెలల తరువాత ఇదే రావడం.

కాసేపు ఏవోవో మాట్లాడాక "నాకీ పెళ్లి అస్సలు ఇష్టంలేదు మధూ. నాకు మనసు లేదు. మనసైన చోట బ్రతకాలనే నా కోరికను నీవు అర్థం చేసుకోలేవా?'' అంది.

నేను తలదించుకున్నాను.

చిన్నప్పటినుంచీ నా మనసులో కోరికలన్నీ తెలుసుకుని తీర్చిన దేవత తనను మొదటిసారిగా కోరుతోంది. కానీ నేను అశక్తుడ్ని. నిరుపేదను. ఎవరికీ ఏమీ ఇవ్వలేని దౌర్భాగ్యుడ్ని. ఆర్థికంగా, మానసికంగా అన్ని విధాలుగా.

★★★

మాలతి పెళ్లి.

గత వారంరోజులుగా అమ్మానాన్నలు సైతం మాలతి పెళ్లి పనులకోసం ఆ ఇంట్లో పనులతో హడావుడి పడుతున్నారు. నన్ను కూడా పనులు చేయమంటున్నారు. కానీ నాకే వెళ్లడానికి మనస్కరించడంలేదు.'నాలాంటి పిరికివాడిని ప్రేమించినందుకు మాలతి ఎంత బాధపడి వుంటుంది?' అన్న ఆలోచన నన్ను మరింత బాధపెడుతోంది. తీసుకోవడమేగానీ ఇవ్వడం ఎంతమాత్రం చేతగాని నా మీద నాకే అసహ్యం వేస్తోంది. మాలతికి నా గుర్తుగా ఏదైనా కానుక ఇవ్వాలి. ఈ అసమర్థుడి జ్ఞాపక చిహ్నంగా తన అత్తారింటిలో అప్పుడప్పుడు జాలిగా నవ్వుకోవడానికైనా ఏమైనా కానుకివ్వాలి. నేనిచ్చేది ఆమెకు అత్యల్పమైనా అపురూపంగా దాచుకుంటుంది మాలతి. ఈ అభాగ్యుడి కానుకను ఆ దేవత తప్ప మరెవరు స్వీకరిస్తారు?

ఏదో చేయాలి అనుకుంటూ రాత్రీ పగలు కష్టపడి, ఓవర్‌టైంలుచేసి నా దృష్టిలో విలువైనది అనుకున్న ఒక కానుకను మాలతి కోసం సంపాదించాను. ఈ కానుకతో నాకు మాలతి దూరమవుతుందన్న సత్యం నన్ను వికల మనస్కున్ని చేస్తోంది.

ముహూర్త సమయం దగ్గర పడుతున్నకొద్దీ నాలో ఏదో గిల్టీ ఫీలింగ్ బలంగా ప్రవేశిస్తోంది. తట్టుకోలేకపోతూ కాస్త నిషా ఉంటే సరిపోతుందనిపించింది. అయితే త్రాగుతున్నకొద్దీ నాలో దుఃఖం అధికమవసాగింది. ఆ మత్తులో ఈ చిన్నపాటి కానుక మాలతి మనసును ఊరడించాలనుకోవడం ఫూలిష్‌నెస్ అనిపించింది. ఆమె స్వీకరిస్తుందా? అనే అనుమానం కూడా మొలకెత్తింది. రకరకాల ఆలోచనలతో బుర్రంతా వేడెక్కిపోగా మత్తులో నాకు తెలీయకుండానే నిద్ర పట్టేసింది.

ఉదయాన్నే అమ్మా నాన్న నన్ను నిద్రలేపి తిట్టిపోసారు. ఆ తెల్లారే మాలతి అత్తారింటికి వెళ్లిపోతుందని, పలకరించడానికైనా వెళ్లకపోతే బాగుండదని హెచ్చరించారు. నేను ఆదరాబాదరాగా గిఫ్ట్ ప్యాక్‌ను పట్టుకుని మాలతి ఇంటికి పరుగెత్తాను.

అప్పటికే మాలతి అత్తారింటికి వెళ్లడానికి సమాయత్తమవుతోంది. ఆమె ఇంటి ముందు కారు రెడీగా వుంది. అప్పగింతల కార్యక్రమం జరుగుతోంది.

అదే సమయంలో గేటు త్రోసుకుని పరుగు పరుగున వస్తున్న నన్ను అందరూ ఆసక్తిగా చూసారు.

అయితే అదేం పట్టించుకోకుండా మాలతివైపు వస్తున్న నేను ఆ పక్కనున్న పెళ్లికొడుకును చూసి విస్తుపోయాను. ఆ పెళ్లికొడుకు నేను పనిచేసే కంపెనీలో సైటు ఇంజనీర్. రెండుమూడుసార్లు వర్కు విషయంలో చిన్న తగాదా కూడా పడ్డాను అతనితో.

మాలతితోపాటు అతను కూడా నావైపు చూస్తున్నాడు. విధిగా నేను అతనికి నమస్కారం చేసాను.

అతను నా చేతిలో వున్న ప్యాకెట్‌ను గమనిస్తూ 'ఇదేమిటి?' అన్నట్లుగా చూసాడు.

నా గొంతులో తడారుతున్నట్లుగా ఉండడంతో తడబడే గొంతుతో "చిన్న కానుక" అన్నాను.

ఆ పెళ్లికొడుకు ఆ కానుకను అతనికోసమే తెచ్చాను అనుకుని "నాన్సెన్స్. ఇలాంటి పనులు చేస్తారనే నా పెళ్లికి వర్కర్స్‌ను ఎవ్వరినీ ఆహ్వానించలేదు. రాత్రీ పగలూ కష్టించి పైసా పైసా కూడబెట్టి ఇలా కట్నాలు, కానుకలు అని హైరానా పడతారని నాకు తెలుసు. నాకలా ఇష్టం ఉండదు కనుకే ఎవరికీ చెప్పలేదు. అయినా ఒక సైట్ ఇంజనీర్ సైట్ వర్కర్ దగ్గర కానుకలు అందుకోవడం వృత్తిద్రోహం అవుతుంది. అయాం సారీ. థాంక్యూ. పద మాలతీ" అంటూ వెంటనే కారెక్కాడు అతను.


నాకు ఒక్కసారిగా అంధకారం ఆవరించినట్టయింది. నిస్సహాయంగా మాలతి నాకేసి చూసింది.

నావైపు అలా జాలిగా చూసే చూపును నేను భరించలేను. నా గుండెను ఎవరో పిండేస్తున్నట్లనిపించింది. నా చేతిలో ప్యాకెట్టు నాకే బరువుగా తోస్తుండగా ఎలాంటి తృణీకారభావం లేకుండా అందరికీ చెబుతున్నట్లుగా నాకూ చేయి వూపుతూ వీడ్కోలు చెబుతోంది మాలతి. నేను నిర్వేదంతో ఆమెకు వీడ్కోలు చెబుతుండగా కారు కదిలిపోయింది. కళ్లల్లో నీళ్ళు మసగ్గా నా కంటిని కమ్మేస్తుండగా మాలతిలేని ఇంటిని చివరిసారిగా చూసాను. ఇంటిముందు మందారం మొక్కకు పూవు పూసింది. అదీ నాలానే తనకు సేవలు, ఉపచారాలు చేసి నీరు పోసి సేద తీర్చిన దేవతకు తన కణజాలాలన్నింటినీ ఉద్దీపింపజేసి ఆమెకు అర్పించుకోవడానికి ఒక పూవు ఇద్దామనుకునేలోగానే మాలతి దూరమయిపోయింది. ఆ మొక్కని ఇక ఎవరు పట్టించుకుంటారు? నా కళ్లల్లో ఒక్కసారిగా నీళ్ళు చిమ్మాయి.

జీవితంలో కొందరు అందరికీ అన్నీ ఇవ్వగలుగుతారు. ఇంకొందరు ఎవరికీ ఏమీ ఇవ్వలేరు.

నేను ఎవరికీ ఏమీ ఇవ్వలేని దౌర్భాగ్యుణ్ణి. ఆర్థికంగా, మానసికంగా అన్నింటిలోనూ పరమ నిరుపేదను.

★



## తరగని కళ

పెళ్లి చేసుకుని ఇల్లాలిగా మారినా తన సహజత్వాన్ని వీడలేకపోతోంది కరిష్మా. హనీమూన్‌కి వెళ్లినా ఆమె సినిమాల గురించి మాట్లాడడం మాత్రం మానడం లేదట. ఒక పక్క సినిమాలతో పాటూ, టీవీ సీరియల్స్ షూటింగ్‌లో బిజీగా ఉన్న కరిష్మా ఈమధ్య ఎక్కడికెళ్లినా జరీ చీర, సిందూరంతో కళకళలాడిపోతోంది. ఇంకా ఈమెకి పెళ్ళికళ తగ్గలేదంటూ అంతా జోక్‌లేస్తూంటే నవ్వుతూ బదులిస్తోంది. అన్నట్టు ఈమెతో పాటూ చెల్లెలు కరీనా కూడా లక్మీ డ్రెస్సులతో కన్పిస్తూ చూసేవారికి కనువిందుచేస్తున్నారు. భర్తతో కలిసి ఆమె ఎంజాయ్ చేస్తోంది.

